సాక్షి
నిర్మల్

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



నిర్మల్‌లో వివాహితపై లైంగికదాడి

నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాహితపై లైంగిక దాడి జరిగింది. ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. 8లో▸



క్రీడలకు చేయూత ఏది..!

జిల్లాలో క్రీడలకు చేయూత కరువవుతోంది. మైదానాలు, కోచ్‌లు లేకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.0 / 19.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమశాతం పెరుగుతుంది. చల్లగాలులు వీస్తాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

శిశు మరణాలు నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో శిశు మరణాలు నియంత్రించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో 'పిల్లల మరణాల'పై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం జరిగిన పిల్లల మరణాలు, దానికి కారణాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సమీక్ష చేశారు. పిల్లల అధిక మరణాలకు కారణాలు తెలుసుకుని వాటిని నివారించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వాసు జిల్లాలోని వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కడెం: షెడ్యుల్ కులాల ప్రజలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి ఎగ్జిక్యూటివ్ మెంబర్ మగ్గిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక, సాంఘిక సమానత్వం కోసం కలిసికట్టుగా పోరాడాలన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు. ఇందులో నాయకులు ఎట్టెం దేవన్నయాదవ్, కిషన్‌గౌడ్, సంజీవయ్య, అశ్విని, భూలక్ష్మి, రాజేశ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

'సదరం' షెడ్యూల్ ఖరారు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సంబంధించి వైకల్య ధ్రువీకరణ కోసం జనవరి నెలకు సంబంధించి సదరం క్యాంపుల తేదీలను డీఆర్డీవో విజయలక్ష్మి ప్రకటించారు. జనవరి 7, 23, 28న ఆర్థో, సీపీఏ, 3న వినికిడిలోపం, 9న మానసిక వైకల్యం, 16న నేత్ర సంబంధ వైకల్యం పరీక్షలు ఉంటాయని వివరించారు. అర్హులైన వారు తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యునితో ఓపీ స్లిప్ ద్వారా దివ్యాంగ కేటగిరీ నిర్ధారించుకునిని దాని ప్రకారం మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ అయినవారు మాత్రమే సదరం శిబిరానికి ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రావాలని వివరించారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇటీవలి జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో జరిగిన సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ 77 కిలోల విభాగంలో సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న బీరవెల్లి గ్రామానికి చెందిన సగ్గం కృష్ణ కూతురు వర్షిణి బంగారు పతకం, 102 కిలోల విభాగంలో దస్తురాబాద్ మండలం మున్యాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న కొట్టె రవి కుమారుడు అభిషేక్ కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

కలిసొచ్చిన కాలం..



- జిల్లాలో పెరిగిన సాగు..
- పలు పంటల్లో అధిక దిగుబడులు
- రూ.2 లక్షల రుణమాఫీతో రైతుకు ఊరట
- సన్నాలకు బోనస్ సంతోషం

నిర్మల్: ఈఏడాది జిల్లా వ్యవసాయంలో పెద్దగా మార్పులేం లేవు. ప్రకృతి కొంత సహకరించడం, ప్రభుత్వం కొంత ఊరటనివ్వడం మినహా పెద్దగా ఫలితాలూ లేవు. గత ఏడాది ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసింది. కొందరికి ఇంకా అందలేదు. సన్నాలకు బోనస్ ఇవ్వడం పండించిన రైతులకు ఊరట కలిగించింది. రైతుబీమా యథావిధిగా కొనసాగింది.

యాసంగిలో పెరిగిన సాగు..

గతేడాదితో పోలిస్తే ఈసారి యాసంగి సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది సీజన్‌లో మొత్తం 2,73,818.23 ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఈఏడాది 3,05,471.01 ఎకరాల్లో సాగు చేశారు. అంటే ఈసారి 31వేల ఎకరాలకు పైగా సాగు పెరిగింది. ఇందులో గతేడాది వరి 1.07 లక్షల ఎకరాల్లో వేయగా, ఈసారి 1.14 లక్షల ఎకరాల్లో వేశారు. మక్క సాగు గణనీయంగా పెరిగింది. పోయినసారి 83,839 ఎకరాల్లో పండించగా, ఈ ఏడాది 1,06,907 ఎకరాల్లో సాగైంది. శనగ సాగు మాత్రం గతేడాది 67,635 ఎకరాల్లో సాగవ్వగా, ఈసారి 55,975 ఎకరాల్లోనే పండించారు. మొత్తం మీద ఈసారి యాసంగిలో పంటసాగు మాత్రం పెరగడం గమనార్హం.

వానాకాలం పరవాలేదు..

జిల్లాలో గత రెండుమూడేళ్లతో పోలిస్తే ఈసారి వానాకాలం సాగుకు ప్రకృతి ఉపశమనం కలిపించింది. ఎందుకంటే.. మూడేళ్లుగా వానాకాలం సాగు ప్రారంభం కాగానే భారీ వర్షాలు, వరదలు వచ్చాయి. దీంతో భారీగా నష్టం జరిగింది. ఈసారి మాత్రం అలాంటిదేం లేదు. వర్షం, వాతావరణం పూర్తిగా పంటలకు అనుకూలించింది. గత వానాకాలం 4,33,361 ఎకరాల్లో సాగు కాగా, ఈసారి 4.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి, మొక్కజొన్న, సోయా పంటలు మంచి దిగుబడి వచ్చాయి.

రుణమాఫీ.. సన్నాలకు బోనస్..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియను ఈ ఏడాది చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోనూ నాలుగు విడతల్లో మాఫీ ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో మొత్తం 71,565 మందికి రూ.658.61 కోట్ల రుణమాఫీ అయింది. అర్హత ఉండి రుణమాఫీ కానివారు ఇంకా ఉన్నారు. రూ.2 లక్షల పైన ఒక్క రూపాయి ఎక్కువగా ఉన్నా మాఫీకాకపోవడంతో అలా కూడా చాలామంది నిరాశకు గురయ్యారు. ఇక రాష్ట్రప్రభుత్వం సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించడానికి బోనస్ ప్రకటించింది. ఈఏడాది సన్నాలకు క్వింటాల్‌కు రూ.500బోనస్‌గా అందించారు. ఈమేరకు జిల్లాలో 6,700 మంది రైతులకు రూ.69.75 కోట్లు బోనస్‌గా అందింది.

పెరిగిన ధాన్యం..

గత ఏడాది వానాకాలంతో పోలిస్తే.. ఈసారి ధాన్యం దిగుబడి పెరిగింది. గత ఖరీఫ్‌లో 1,37,104 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈసారి 203 కేంద్రాల ద్వారా 1,42,759 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం గమనార్హం. వానాకాలం కొనుగోలుకు సంబంధించి రూ.314కోట్లు చెల్లించారు. ఇందులో సన్నరకాలకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించారు.

టీచర్ల సమ్మెబాట.. విద్యార్థుల ఇంటిబాట



సెలవుపత్రాలు తీసుకుంటున్న ఎంఈవో



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ స్వాతి

- చదువులు సాగక నష్టపోతున్నామంటున్న విద్యార్థులు
- భోజనం సరిగా లేక పస్తులుంటున్న వైనం..
- తల్లిదండ్రుల ఆందోళనతో ఇళ్లకు పంపుతున్న అధికారులు

సారంగపూర్/దిలావర్‌పూర్: డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమ్మెబాటపట్టారు. 19 రోజులుగా బోధన సిబ్బంది పాఠశాలలకు రావడం లేదు. దీంతో విద్యాబోధన చేసేవారు లేక పాఠాలు నష్టపోతున్నారు. భోజనంపై పర్యవేక్షణ కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బోధన ఆగిపోవడం, భోజనం నాసిరకంగా మారడంతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. సారంగాపూర్ మండలం జామ్, దిలావర్‌పూర్ గ్రామంలోని కేజీబీవీల విద్యార్థులు శనివారం ఇంటిబాట పట్టారు. చదువులు సాగడం లేదని, భోజనం సరిగా ఉండడం లేదని, పురుగుల అన్నం పెడుతున్నారని పిల్లలు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలల వద్దకు చేరుకున్నారు. ఎంఈవోలు మధుసూదన్, శంకర్‌తో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామని, వంట మనుషులను సైతం ఏర్పాటు చేసి భోజనం తయారు చేయిస్తున్నామని పేర్కొన్నారు. అయితే భోజనం రుచిగా ఉండడం లేదని ఎంఈవోలతో వాగ్వాదానికి దిగారు. తమ పిల్లలకు ఏమైనా జరిగితే బాధ్యత తీసుకుంటారా అని నిలదీశారు. దిలావర్‌పూర్ తహసీల్దార్ స్వాతి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. ఎస్సై సందీప్ పరిస్థితిపై ఆరా తీశారు. అన్నంలో పురుగులు వచ్చాయనీ, ఒక బొద్దింక కూడా వచ్చిందంటూ విద్యార్థినులు తెలిపారు. దీంతో చేసేది లేక ఎంఈవో మధుసూదన్ పిల్లలను తీసుకెళ్లేందుకు ముందుకు వచ్చినవారితో సెలవు చీటీలు రాయించుకుని వారికి పిల్లలను అప్పగించారు. ఈవిషయమై ఎంఈవోను వివరణ కోరగా తమ తీసుకెళ్లడానికి సుముఖంగా ఉన్న తల్లిదండ్రులతో పిల్లలను పంపించామన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు

కేజీబీవీ విద్యార్థులు ఆందోళన చెందొద్దని కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని డీఈవో రామారావు అన్నారు. జామ్ గ్రామంలోని కేజీబీవీని శనివారం రాత్రి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ సమ్మెకారణంగా ఎదుర్కొన్న సమస్యలను గురించి ఆరా తీశారు. అనంతరం బయటకు వచ్చిన డీఈవో మీడియాతో మాట్లాడారు. సమ్మెలో ఉన్న నాన్‌టిచింగ్ స్టాఫ్ కుక్, అసిస్టెంట్‌కుక్, డేఅండ్ నైట్ వాచ్‌ఉమెన్‌లు, ఏఎన్‌ఎం సహా ఇతర సిబ్బంది మొత్తం 10 మంది విధులకు హాజరైనట్లు వెల్లడించారు. త్వరలోనే టీచింగ్‌స్టాఫ్ కూడా సమ్మె విరమించి విధుల్లోకి చేరే అవకాశం ఉందని తెలిపారు.

డంపింగ్ యార్డు సక్రమంగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సూచనలు చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: డంపింగ్ యార్డ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని డంపింగ్ యార్డ్‌ను శనివారం తనిఖీ చేశారు. రోజువారీగా డంపింగ్ యార్డ్‌కు వస్తున్న చెత్త, నిర్వహణ, సెగ్రిగేషన్ తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలోని ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను ఏరోజుకారోజు వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. సెగ్రిగేషన్ ప్రదేశంలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పేపర్, తుక్కు, గాజు సీసా, అట్ట పెట్టెలను వేరుగా విభజించాలన్నారు. పునఃవినియోగానికి వీలున్న చెత్తను వేరు చేసి ఉంచాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ ఆవరణలో తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ అధికారి బాలీడ్ అహ్మద్, నిర్మల్ గ్రామీణ తహసీల్దార్ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలను గుర్తించి, పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుకను కేవలం నిబంధనల మేరకు మాత్రమే సేకరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఆ నిర్మాణాల గుత్తేదారులకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆయా నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక వివరాల నివేదికలను అందజేయాలని సూచించారు. నివేదికల ప్రకారమే ఆయా శాఖలో జరుగుతున్న నిర్మాణాలకు ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను కొనుగోలు చేయరాదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టాలన్నారు. సమావేశంలో మైన్స్ ఏడీ రవీందర్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు శంకరయ్య, అశోక్‌కుమార్, సందీప్, అధికారులు పాల్గొన్నారు.

భిక్షాటనను నియంత్రించాలి

నిర్మల్‌చైన్‌గేట్: భిక్షాటన నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బాలల సంక్షేమ కమిటీ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. జిల్లాలో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, బాల్య వివాహాల నియంత్రణ, అనాథ బాలల గుర్తింపు తదితర అంశాలపై సీడబ్ల్యూసీ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనవరి 1 నుంచి భిక్షాటన నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భిక్షాటన నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలని సూచించారు. పట్టణాలలోని ముఖ్య కూడళ్లలో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి, పునరావాస కేంద్రాలను తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలలో భిక్షగాళ్లకు ఆశ్రయం, ఆహారం, విద్య, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలన్నారు. భిక్షాటన నియంత్రించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. భిక్షాటనను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి భిక్షాటన నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళి, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సర్దుబాటు..

- కేజీబీవీలకు మహిళా ఉపాధ్యాయులు
- 'సమగ్ర' ఉద్యోగుల సమ్మెతో ప్రభుత్వం నిర్ణయం
- మా టీచర్లు మాకే రావాలంటున్న విద్యార్థులు



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న సోన్ ఎంఈవో పరమేశ్వర్

లక్ష్మణచాంద: జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు, కళాశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు 20 రోజులుగా సమ్మె చేస్తున్నారు. పాఠశాలలకు హాజరు కావడం లేదు. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 కేజీబీవీలు, కళాశాలల విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళా ఉపాధ్యాయులను కేజీబీవీలకు కేటాయించాలని ఆదేశించింది. దీంతో డీఈవో రామారావు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను కేజీబీవీల్లో సర్దుబాటు చేశారు. ఇందులో భాగంగా ఒక్కో కేజీబీవీలకు 6 నుంచి 12 మంది మహిళా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు.

విధుల్లోకి మహిళా ఉపాధ్యాయులు...

ప్రభుత్వం సర్దుబాటు చేసిన మహిళా ఉపాధ్యాయులు శనివారం తమకు కేటాయించిన కేజీబీవీలకు వెళ్లి విధులు నిర్వహించారు. రోజుకు ముగ్గురు నుంచి నలుగురు చొప్పున మహిళా ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యేలా ఆయా మండలాల ఎంఈవోలు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు.

రాత్రి మహిళా కానిస్టేబుళ్లు..

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో రాత్రివేళ విద్యార్థుల రక్షణ కోసం ఓ కానిస్టేబుల్‌కు విధులు కేటాయిస్తున్నారు. విద్యార్థుల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవోలు తెలిపారు.

వంటకు ఇబ్బంది....

కేజీబీవీలలోని విద్యార్థులకు వంట చేయడం ఇబ్బందిగా మారింది. ఇందులో పనిచేస్తున్న వంట సిబ్బంది కూడా సమ్మెబాట పట్టడంతో విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేయడం కష్టంగా మారిందని పలు మండలాలకు చెందిన ఎంఈవోలు అంటున్నారు. ఆయా మండలాల ఎంఈవోలు తమ క్లస్టర్ల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట చేసే సిబ్బందిలో కొంత మందిని బతిమాలి కేజీబీవీలకు తరలించి వంట చేయిస్తున్నారు. కొన్నిచోట్ల ఇంటర్ విద్యార్థులే వంట పాత్రలు శుభ్రం చేయడంతోపాటు వంట కూడా చేస్తున్నట్లు తెలిసింది.

మా టీచర్లు మాకే కావాలి...

తమకు ఇన్ని రోజులు విద్యను బోధించిన టీచర్లే కావాలని, కొత్త ఉపాధ్యాయులు వద్దని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. శనివారం కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో కనీసం మాట్లాడలేదని మహిళా ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కొందరు భోజనం చేయమని మారాం చేశారు. దీంతో విద్యార్థులను బుజ్జగించి చివరకు తినేలాగా చేస్తున్నామని అంటున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



కేజీబీవీ సిబ్బంది సమ్మెలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 18 కేజీబీవీలకు ఆయా మండల పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందుబాటులో మహిళా ఉపాధ్యాయులను 6 నుంచి 12 మందిని కేటాయించాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రామారావు, డీఈవో, నిర్మల్

విధుల్లో చేరిన నాన్ టీచింగ్ సిబ్బంది



డీఈవోతో నాన్ టీచింగ్ సిబ్బంది

నిర్మల్ రూరల్: విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్మల్ అర్బన్, జిల్లా కేంద్రంలోని యూఆర్ఎస్ అర్బన్ పాఠశాలల సమగ్ర శిక్ష నాన్ టీచింగ్ సిబ్బంది శనివారం సాయంత్రం విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయంలో డీఈవో రామారావుకు జాయినింగ్ లెటర్ రాసి ఇచ్చారు. విద్యార్థులు తమవల్ల ఇబ్బందులకు గురికావొద్దని, వారి క్షేమం దష్టా విధుల్లో చేరుతున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఈవో వారిని అభినందించారు. మిగతా కేజీబీవీలలోని సిబ్బంది కూడా విధుల్లో చేరాలని కోరారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కేజీబీవీ జిల్లా ప్రత్యేక అధికారి సలోమి కరుణ, అధికారులు వెంకటరమణ, నరసయ్య, ప్రవీణ్ కుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతుగా ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్
- సమగ్ర ఉద్యోగుల సమ్మెకు మద్దతు

నిర్మల్‌రూరల్: 20 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి మద్దతు ప్రకటించారు. పక్క రాష్ట్రాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, మన రాష్ట్రంలో పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్భాటాలు పలికారని, ఇప్పుడు ఆ ఉద్యోగుల సమ్మెవైపు కనీసం కన్నెత్తి కూడా చూడ డం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నాప్ర స్తుతం 15% ఎక్కువ బడ్జెట్ ఉందని, ఆ నిధులతో ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా మంత్రులు, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అంతకుముందు ఉద్యోగులు మున్సిపల్ ఆఫీసు ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి ఇటీవల ప్రాణాలు కోల్పోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. సమ్మెలో నాయకులు గంగాధర్, రాజారత్నం, గజేందర్, నరేశ్, రాము, ప్రభ, తిరుమల, నవిత, ఆనంద్, గంగాధర్, సంగీత, ప్రత్యూష, లతాదేవి, జ్యోతి, వీణ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో నిర్వహించే నుమాయిష్(ఎగ్జిబిషన్)కు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నుమాయిష్ నిర్వహణపై అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులు 'నిర్మల్ ఉత్సవాలు' పేరుతో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నుమాయిష్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, పెయింటింగ్స్, హస్తకళలు, మహిళా స్వయం సంఘాల ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేయాలని వివరించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి నుమాయిష్ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమం ప్రజలందరికీ తెలిసేలా హోర్డింగ్స్ ఏర్పాటు చేసి, కరపత్రాలు పంచాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చరిత్రకారులతో జిల్లా చరిత్రను తెలిపే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రజలను ఆకర్షించేలా నుమాయిష్ పరిసర ప్రాంతాలను అందమైన లైటింగ్‌తో ముస్తాబు చేయాలని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న వస్తువులను ప్రదర్శించేందుకు అనుమతి కోసం ఆన్‌లైన్ లింకు ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డిని 9849913071 నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీఈవో పి.రామారావు, డీఎస్‌వో కిరణ్‌కుమార్, ఈడీఎం నదీమ్, డీఎంహెచ్‌వో రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని కోతి మృతి



మృతి చెందిన కోతి

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై శనివారం పోలంపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కోతి మృతి చెందింది. వాహనదారులు కోతులకు ఆహారపదార్థాలు వేయగా అవి గుంపుగా వచ్చి తినే ప్రయత్నం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఓ కోతి మృతిచెందింది. వారంలో కనీసం 10కి పైగా కోతులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి వాహనదారులు ఆహారం వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

సోన్: లారీ డివైడర్ ఢీకొట్టిన ఘటన మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది.. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర నుంచి కేరళలోని కొచ్చిన్‌కు ఫైబర్ డోర్స్ లోడుతో లారీ వెళ్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గంజాల్ టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్ నిద్రలో జారుకోవడంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్లీనర్ అరుణ్ మురుగన్ ఫిర్యాదుతో డ్రైవర్ సర్వరాజ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై షేక్‌అహ్మద్ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భార్యపై భర్త తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ అన్వర్ గత కొంతకాలంగా భార్యను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఆమెను కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్వర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

బావిలో దూకి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కి చెందిన గంగన్న (41) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి వలసవచ్చాడు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య మందలించడంతో క్షణికావేశంలో శనివారం రాత్రి రుయ్యాడి సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

సీవోఈ నోటిఫికేషన్ ఎప్పుడో?

- విడుదలలో జాప్యం
- ఎదురుచూస్తున్న విద్యార్థులు
- 'పది'లో మార్కుల ఆధారంగా ప్రవేశాలనే ప్రచారం
- అధికారిక ప్రకటన లేక ఊహాగానాలు



బెల్లంపల్లి సంక్షేమ బాలుర సీవోఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్షకు ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, సీవోఈలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీలో జాప్యం జరుగుతోంది. ఏటా డిసెంబర్ రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుండగా ఈసారి ఆలస్యం అవుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపదికన విద్యార్థులకు ఈసారి అడ్మిషన్ కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఈవిషయంలో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ రకరకాలుగా ఊహాగానాలు వస్తున్నాయి. ఈకారణంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. సీవోఈ ప్రవేశపరీక్షకు సిద్ధం కావాలా లేక పదో తరగతి పరీక్ష మెరుగ్గా రాయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు సీవోఈలు..

ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు రెండు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సీవోఈ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికల సీవోఈ కళాశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించి వీటిలో మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండేసి సెక్షన్ల చొప్పున 80 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. సాధారణ గురుకులాల కన్నా సీవోఈ కళాశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్ విద్యాబోధన చేస్తూనే నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థుల్లో విపరీతమైన క్రేజీ ఏర్పడి ఏటేటా పోటీ రెట్టింపవుతోంది.

విద్యార్థులకు వరం..

సీవోఈల్లో ప్రవేశం దక్కితే చాలు విద్యార్థుల భవిష్యత్ బంగారు మయమవుతుందనేది తల్లిదండ్రుల ఆశ. ఈకారణంగానే పదో తరగతి చదువుతున్న తమ పిల్లలకు సీవోఈ ప్రవేశపరీక్ష రాయడానికి ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పిస్తుండటం చేస్తున్నారు. ప్రవేశం పొందిన విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువులో, పోటీ పరీక్షల్లో నెగ్గేలా ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సీవోఈలు ప్రత్యేకతను ఏర్పరుచుకున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ఏటా పదులసంఖ్యలో ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లతోపాటు ఐఐటీలోనూ ప్రవేశం పొందుతున్నారు.

వారంలో వస్తుంది



విద్యార్థులు ఎలాంటి గందరగోళానికి గురికావద్దు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కళాశాలల్లో ప్రవేశానికి ఎప్పటిమాదిరిగా ఈసారి ప్రవేశపరీక్ష నిర్వహిస్తాం. పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయించడం జరగదు. ప్రవేశపరీక్షకు సంబంధించి వారంలో నోటిఫికేషన్ వస్తుంది. విద్యార్థులు పరీక్షకు సిద్ధమై ప్రతిభను చాటుకోవాలి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ

కార్యదర్శి కక్కుర్తి

- రాజీనామా చేసిన కారోబార్ వేతనం నొక్కేశాడు
- ఆరు నెలల వేతనాలు మరొకరి ఖాతాలో జమ
- విషయం తెలిసి ఫిర్యాదు చేసిన మాజీ కారోబార్

కోటపల్లి: పంచాయతీ కారోబార్‌గా రాజీనామా చేసిన వ్యక్తి పేరిట ఆరునెలల వేతనాలను వేరే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో వేయించి కార్యదర్శి నొక్కేశాడు. ఈ ఘటన కోటపల్లి మండల కేంద్రం పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి పంచాయతీలో 2021–24 వరకు కారోబార్‌గా కొంకటి సుందర్ పనిచేశాడు. వ్యక్తిగత కారణాలతో గత జూన్‌లో రాజీనామా చేశాడు. కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ.. సుందర్ పేరిట నెల వేతనం రూ.21,450, ఇలా ఆరునెలల వేతనాలను చెన్నూర్ పట్టణానికి చెందిన నలమాసు రమేశ్ అకౌంట్‌లో జమ చేశాడు. విషయం తెలుసుకున్న సుందర్.. కోటపల్లి పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కోటపల్లి, పంగిడిసోమారం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ పంచాయతీ నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ మహేంద్రనాథ్ వివరణ కోరగా కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిధులు రికవరీ చేసి కోటపల్లి ఇన్‌చార్జిగా సత్యనారాయణను తొలగిస్తామన్నారు.

విహారయాత్రలో విషాదం

- కర్ణాటకలోని మైసూరు వద్ద కారు బోల్తా
- ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో మంచిర్యాల యువకుడు

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ కోసం కర్ణాటక వెళ్లిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల విహారయాత్ర విషాదంగా మారింది. సంతోషంగా గడపాలనుకున్న వారి ఆశ మార్గమధ్యలోనే ఆవిరైంది. శనివారం తెల్లవారుజాము మైసూరు సమీపంలో వీరి కారు బోల్తాపడిందని సమాచారం. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో మంచిర్యాల వాసి యువకుడు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లాకేంద్రంలోని దొరగారిపల్లెకు చెందిన బల్లపల్లి శంకరమ్మ–వెంకన్న కుమారుడు సందీప్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సందీప్ తన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి శుక్రవారం కారులో కర్ణాటకకు బయల్దేరారు. శనివారం వేకువజామున మైసూరు సమీపంలోకి చేరుకోగా అదుపు తప్పి బోల్తాపడినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో సందీప్ మృతి వార్త విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మైసూరు బయల్దేరి వెళ్లారు. సందీప్ మృతితో దొరగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం సందీప్ మృతదేహం మంచిర్యాలకు చేరుకునే అవకాశం ఉంది.



సందీప్ (ఫైల్)

నిర్మల్‌లో వివాహితపై లైంగికదాడి

- భర్తతో గొడవపడి బయటకు వచ్చిన మహిళ
- లాడ్జికి తీసుకెళ్లి ఓ వ్యక్తి అఘాయిత్యం
- బాధితురాలికి ఎస్పీ జానకీ షర్మిల పరామర్శ

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాహితపై లైంగికదాడి జరిగింది. రాత్రి సమయంలో భర్తతో గొడవపడి బయటకు వచ్చిన ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ యోగేష్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. డబ్బులు అవసరం ఉన్నాయని ఆమె అడుగగా.. యోగేష్ తనకు పరిచయం ఉన్న కళ్యాణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి రప్పించాడు. బస్టాండ్‌కు వచ్చిన కళ్యాణ్ ఆమెను పట్టణంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. లొంగదీసుకోవాలని ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బస్టాండ్‌కు వచ్చిన మహిళ ఓ ఆటోలో స్పృహ కోల్పోయి పడిపోయింది. ఆటోడ్రైవర్ అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించాడు.



బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్

వెంటనే ఆ మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని ఘటన స్థలాన్ని క్లూస్ టీం సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. రాత్రి సమయంలో డ్యూటీ చేసే పోలీసులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఘటనపై మంత్రి సీతక్క ఆరా

జిల్లా కేంద్రంలో వివాహితపై జరిగిన అత్యాచార ఘటన గురించి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం రాత్రి ఆరా తీశారు. ఎస్పీ జానకీ షర్మిలతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు.

బెల్లంపల్లి అభివృద్ధికి 'సొసైటీ' నిధి..!

- అప్పట్లో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్
- రూ.40 లక్షలకు చేరిన వైనం..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రజోపయోగ అవసరాల రీత్యా సారా కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి రాజకీయ, కార్మిక, వ్యాపార, పుర ప్రముఖులు ఏకమై బ్యాంకులో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ చేయగా ప్రస్తుతం రూ.40 లక్షల వరకు చేరుకున్నాయి. వీటిని భవిష్యత్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఖర్చు చేయాలనే పట్టుదలతో ఉండగా, సరైన అవసరాలను గుర్తించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది.

ముగ్గురు సభ్యుల సంతకాలతో..

రూ.6 లక్షల చందా డబ్బులను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుత ఎస్బీఐ) బెల్లంపల్లి శాఖ బ్యాంకులో ఫిక్స్‌డ్ చేశారు. కమిటీ సభ్యులు తాటిపాముల నాగయ్య, గోనే శ్యాంసుందర్‌రావు, రతన్‌లాల్ ఈ ముగ్గురిలో ఇద్దరు సంతకం చేసి డబ్బులు విత్ డ్రా చేసేలా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.5 లక్షల వరకు విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, భారత స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణకు రూ.లక్ష వెచ్చించారు. మిగతా డబ్బులు బ్యాంకులో నిల్వ ఉండటం గమనార్హం.

1982లో సొసైటీ రిజిస్ట్రేషన్

సింగరేణి బొగ్గు గనులతో 1980లో బెల్లంపల్లి ఎంతగానో విరాజిల్లింది. పారిశ్రామిక క్షేత్రంగా ఉన్న బెల్లంపల్లిని విద్యా, సాంస్కృతిక పరంగా అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో 'ది బెల్లంపల్లి ఎడ్యుకేషనల్, కల్చరల్, సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ'ని ఏర్పాటు చేసి 1982లో రిజిస్ట్రేషన్ చేయించారు. సొసైటీ చైర్మన్‌గా బాశెట్టి గంగారాంను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అప్పటి మాజీ ఎమ్మెల్యేలు గుండా మల్లేశ్, దాసరి నర్సయ్య, రాజకీయ, కార్మిక నాయకులు బాశెట్టి గంగారాం, తాటిపాముల నాగయ్య, చిప్ప నర్సయ్య, నామసాని రామారావు, వ్యాపార వర్గాలు రతన్‌లాల్, తేజ్ ప్రకాశ్, మంచిర్యాలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు గోనే శ్యాంసుందర్‌రావు, అప్పటి బడా సారా కాంట్రాక్టర్ కె.సాగర్‌రావు ఉన్నారు. కాగా, కమిటీ సభ్యుల్లో గుండా మల్లేశ్, డి.నర్సయ్య, బి.గంగారాం, టి.నాగయ్య, ఎన్.రామారావు, రతన్‌లాల్ మృతిచెందారు.



సమావేశమైన ప్రస్తుత కమిటీ సభ్యులు (ఫైల్)

నిర్దేశిత లక్ష్యాలు

బెల్లంపల్లి అభివృద్ధికి కమిటీ సభ్యులు పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధన కేంద్రం మంజూరు, హైదరాబాద్–న్యూఢిల్లీ మార్గంలో ఉన్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు, ఆడిటోరియం నిర్మాణం, శ్మశానవాటికల్లో, పోచమ్మ చెరువు వద్ద కర్మకాండల నిర్వహణకు షెడ్లు, ఆర్టీసీ బస్‌డిపో మంజూరు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, టీబీ రోగుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పారదర్శకత పాటిస్తాం

బెల్లంపల్లి అభివృద్ధి కోసం వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో రూ.40 లక్షల వరకు పోగయ్యాయి. కమిటీ సభ్యుల్లో పలువురు మృతిచెందారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకోవల్సి ఉంది. చందా డబ్బుల లెక్కలను ప్రజలకు త్వరలోనే బహిరంగ పరుస్తాం. దాపరికంగా వ్యవహరించం. పారదర్శకతను పాటిస్తాం.– గోనే శ్యాంసుందర్‌రావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు

కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి

కొత్త కమిటీని ఏర్పాటు చేసి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉంది. బెల్లంపల్లిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ, బీఎడ్, మహిళా డిగ్రీ కళాశాలల మంజూరుకు కృషి చేయాల్సి ఉంది. సాంస్కృతిక కార్యక్రమాలకు ఆడిటోరియం, పేదలకోసం ఫంక్షన్ హాల్ నిర్మించాలనే డిమాండ్ ఉంది. చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థులను ప్రోత్సహించడానికి ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

గత యూనియన్ల అలసత్వంతోనే సమస్యలు


రెబ్బెన(ఆసిఫాబాద్): గతంలో గుర్తింపు కార్మిక సంఘంగా పనిచేసిన యూనియన్ల అలసత్వంతోనే కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని వివిధ డిపార్టుమెంట్లలో శనివారం ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. సింగరేణి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో యాజమాన్యంతో చర్చించిన అంశాలను కార్మికులకు వివరించారు. సొంత ఇల్లు పథకం అమలు, 200 గజాల ఇంటి స్థలం, పెర్క్స్‌పై ఐటీ యాజమాన్యం చెల్లించేలా చూస్తామని, కొత్త ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెడతామని, గైర్హాజరు శాతం తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకోసారి మాస్టర్ల ప్రతిపాదికన ప్రోత్సాహక బహుమతి ఇచ్చేవిధంగా యాజమాన్యంతో మాట్లాడామని అన్నారు. జూనియర్ అసిస్టెంట్స్ ప్రమోషన్ పాలసీలో మార్పులు, బదిలీ వర్కర్స్ విధానాన్ని ఎత్తివేసి జనరల్ మజ్దూర్‌గా అపాయింట్‌మెంట్ అయ్యే విధంగా చూస్తామన్నారు. డిస్మిస్ కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్‌గా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, ఆశోక్, నాయకులు ఓదెలు, శ్రీనివాస్, అంజయ్య, రాంకిషన్, గోపాల్, సురేష్‌కోరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సీఆర్టీల నిరవధిక సమ్మెకు మద్దతు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉమ్మడి జిల్లాకు చెందిన సీఆర్టీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి సమ్మె 13వ రోజూ చేరింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌లు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు నెలల వేతనాలు అందకపోవడంతో సీఆర్టీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణతోపాటు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్టీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ మహిళా నాయకురాలు పెందోర్ పుష్పరాణి, నాయకులు అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి


జలపాతం వద్ద 'బుల్లెట్‌రెడ్డి' షూటింగ్

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద శనివారం 'బుల్లెట్‌రెడ్డి'సినిమా షూటింగ్ నిర్వహించారు. జలపాతం అందాల మధ్య నిర్మాత , దర్శకుడు, హీరో ఆదిరెడ్డి, హీరోయిన్ హానికలకు సంబంధించి పాట చిత్రీకరించారు. జలపాతంతోపాటు అర్బన్ పార్కులోనే రెండు పాటలు పూర్తి చేశారు. తమకు సహకరించిన బోథ్ ప్రజలు, అధికారులకు హీరో ఆదిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



పాట చిత్రీకరణలో హీరో, హీరోయిన్

నాటిన మొక్కలకు ఆన్‌లైన్ నమోదు



యాప్‌లో నమోదు చేస్తున్న మాజీ సర్పంచ్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కే) గ్రామంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో నాటిన మొక్కలను శనివారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాటిన ప్రతీ మొక్కను ఫోన్ ద్వారా వనమాలి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్కకు ఒక్క బార్‌కోడ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడ నుంచైన చూసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ముఖరా(కే) గ్రామంలో మొక్కలను ఆన్‌లైన్ చేయడం తొలిసారని పేర్కొన్నారు.


చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ నుంచి పవన్, ప్రవీణ్‌లు కారులో శనివారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారికి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.


నారుమడుల్లో జాగ్రత్తలు పాటించాలి

- రైతులు సూచనలు పాటిస్తే దిగుబడులు

చెన్నూర్‌రూరల్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొందరు నారు పెంచేందుకు మడులు సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. నారుమడుల పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏవో యామిని వివరిస్తున్నారు. నారుమడుల్లో కలుపు, ముఖ్యంగా ఊద సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీని నివారణకు ఎకరా నారుమడికి బుటీక్లోర్ 1.5 లీటర్ తీసుకుని 200ల లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తిన సమయంలో లేక, 8వ రోజున మడిలో పిచికారీ చేయాలి. లేదా విత్తిన 14 నుంచి 15 రోజుల్లో సైహలోపాప్ బ్యుటైల్ 10 శాతం 400మి.లీ. 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేసిన 4 నుంచి 5 రోజులకు ఎకరాకు 30–40 గ్రాముల ఆక్సిడయార్జిల్ 25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి. పిచుకలు, అడవిపందులు రాకుండా నారుమడికి నాలుగు వైపులా నాలుగు పొడవాటి కర్రలు ఏర్పాటు చేసి కవర్లు తొడగాలి. గాలివీచినప్పుడు కవర్లు చప్పుడు అయ్యి అవి దగ్గరకు రావు. లేదంటే కర్రలకు ఖాళీ సీసాతోపాటు నట్‌బుల్లోట్‌ను ఏర్పాటు చేయాలి. లేదా పాత పల్లానికి రంధ్రం చేసి దానికి బుల్లోట్ కట్టినట్లయితే గాలికి అవి కదిలి శబ్దానికి పిచుకలు, అడవిపందులు అటువైపుగా రావు. ఇలా చేస్తే రైతులు నారుమడులను కాపాడుకోవచ్చు.



యామిని, ఏవో, చెన్నూర్



వరినారు మడిని పరిశీలిస్తున్న ఏవో

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

తానూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన భోసి గ్రామానికి చెందిన ఉద్యమకారుడు రాఘవులు (75) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. 2010 జనవరి 11న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొట్టమొదటగా తానూరు మండలం భోసి గ్రామంలో ఐదు రోజులు ఆయన అమరణ నిరహార దీక్ష చేపట్టారు. తెలంగాణ సాధనకు ఎంతో కృషిచేశారు. వయస్సు రీత్యా అనారోగ్యం బారినపడి నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా మృతిచెందారు. ఆయన మృతిపట్ల ఉద్యమకారులు గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. ఉద్యమ సమయంలో అయన చేసిన సేవలను కొనియాడారు.



రాఘవులు (ఫైల్)